సాక్షి అనకాపల్లి

గురువారం । 22 । జూన్ । 2023




నిందితుల పట్టివేత

వ్యాపారులను బెదిరించి నగదు దోచుకున్న కేసులో 9 మందిని అరెస్టు చేశారు. ఎస్పీ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. 8లో



మత్స్యావతారంలో జగన్నాథుడు

జగన్నాథస్వామి రథోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. జగన్నాథుడు బుధవారం మత్స్యావతారంలో దర్శనమిచ్చారు.



సింహ'గిరి ప్రదక్షిణ' 8లో

వచ్చేనెల 2, 3 తేదీల్లో సింహగిరి, ఆలయ ప్రదక్షిణలపై విశాఖ కలెక్టర్ సమీక్ష జరిపారు. సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు.

న్యూస్‌రీల్

పండగలా టీఎస్‌ఆర్ కిట్ల పంపిణీ

- ఐడీసీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంతలక్ష్మి



నర్సీపట్నం : గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.అనంతలక్ష్మి తెలిపారు. జూలై 1 నుంచి వారం రోజుల పాటు టీఎస్‌ఆర్(టేక్ హోం రేషన్) కిట్ల సంబరాలను పండగలా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పౌష్టికాహారాన్ని తీసుకునేవారని, ఇక మీదట ఇంటి వద్దే అందిస్తామన్నారు. ఈ కిట్‌లో బియ్యం, పప్పు, గుడ్లు, ఆయిల్ అందిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో 1.908 కేంద్రాల్లో 18,706 మంది గర్భిణులు, బాలింతలకు టీఎస్‌ఆర్ కిట్లను అందిస్తామన్నారు. కిట్ల పంపిణీకి మార్గదర్శకాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించామన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

నర్సీపట్నం : నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. నర్సీపట్నం, గొలుగొండ, నక్కపల్లి ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న ఒక మినీ అంగన్‌వాడీ, 11 ఆయా పోస్టులకు 27 మంది దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూలకు 23 మంది హాజరయ్యారు. ఈ ఇంటర్వ్యూలను ఆర్డీవో కార్యాలయ ఏవో సూర్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ కె.అనంతలక్ష్మి, జిల్లా అదనపు వైద్యాధికారిణి జ్యోతి, ప్రాజెక్టు సీడీపీవోలు నిర్వహించారు.

హౌసింగ్ పీడీ సరెండర్

తుమ్మపాల : పలు అవినీతి ఆరోపణల దృష్ట్యా జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ కూర్మునాయుడును ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి బుధవారం తెలిపారు. ఆయనపై పలు ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టిన అనంతరం ఆయన్ని గృహనిర్మాణ శాఖ కేంద్ర కార్యాలయం, విజయవాడకు అటాచ్ చేశామన్నారు. ఆయన స్థానంలో ట్రైనీ కలెక్టర్ ధాత్రిరెడ్డికి బాధ్యతలు అప్పగించినట్టు పేర్కొన్నారు.

నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

కొమ్మాది: జవహర్ నవోదయ విద్యాలయలో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం గత ఏప్రిల్ నెలలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ కె.సంజయ్ తెలిపారు. అభ్యర్థులు నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ నుంచి https://cbscit.in/cbse/2023/nvsresult/Result.aspx లింక్ ద్వారా రిజిస్టర్డ్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేసుకుని ఫలితాలు పొందవచ్చని తెలియజేశారు.

25న ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షకు ఏర్పాట్లు

విశాఖ విద్య: యూపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహించే ఇంజనీరింగ్ సర్వీసెస్ మెయిన్ పరీక్షకు పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇంజనీరింగ్ సర్వీసెస్ మెయిన్ పరీక్షకు జిల్లాలో 73 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. నగరంలోని ఏవీఎస్ కాలేజీలో పరీక్ష కేంద్రం ఏర్పాట్లు చేశామన్నారు. యూపీఎస్సీ నిబంధనలకు అనుగుణంగా పరీక్ష నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలన్నారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ): ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి సహకరించాలని కోరారు. ఈ నెల 22న ఖరగ్‌పూర్–విల్లుపురం (22603) ఎక్స్‌ప్రెస్, షాలిమార్–హైదరాబాద్(18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–డిఘా(22874) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–మంగుళూరు (22851) వివేక్ ఎక్స్‌ప్రెస్, డిబ్రూఘడ్–సికింద్రాబాద్ (07047) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. ఈ నెల 23న డిఘా–విశాఖపట్నం(22873) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం–హౌరా(22832) ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఆనంద యోగం

ఆరోగ్యానికి యోగా.. ఆధ్యాత్మికతకు యోగా.. మానసిక ఒత్తిడిని నియంత్రించేందుకు యోగా.. ఉల్లాసంగా, ఉత్సాహంగా, ప్రశాంతంగా జీవనం సాగించేందుకు యోగా.. ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయి. కాబట్టే ప్రపంచం యోగాను అభ్యసిస్తోంది.. అనుసరిస్తోంది.. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా అంతటా ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. దీపం మరో దీపాన్ని వెలిగించినట్టు యోగా సాధకులు మరింత మందికి ఈ ఆనంద యోగాన్ని పరిచయం చేశారు.

–సాక్షి న్యూస్ నెట్‌వర్క్



అనకాపల్లిలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఆయుష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యోగా చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ



పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థలో యోగా చేస్తున్న విద్యార్థులు



యోగా డే అక్షర రూపంలో కె.కోటపాడు మండలంలోని కింతాడ కేజీబీవీ విద్యార్థినుల విన్యాసం

జనులకు సురక్ష

- అర్హత ఉండీ లబ్ధి పొందని వారికి వరం
- ధ్రువపత్రాలు అవసరమైన వారికి మంచి అవకాశం
- అవగాహన కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్



సూదివలసలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వివరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కె.కోటపాడు: అర్హత ఉండి సంక్షేమ లబ్ధిని పొందని కుటుంబాలకు జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధి చేకూర్చనున్నట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. ఈ పథకంపై రెండు రోజులపాటు గ్రామ సచివాలయాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సూదివలస గ్రామ సచివాలయంలో జరిగిన సమావేశానికి కలెక్టర్ ఆకస్మికంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఈ నెల 24 నుంచి జూలై 1 వరకూ వలంటీర్లు వారి క్లస్టర్‌లో గల కుటుంబాలను తప్పనిసరిగా కలవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులు అయి ఉండి వారికి ఏ కారణంగానైనా లబ్ధి అందకపోతే.. వారిని గుర్తించి సచివాలయ సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కుల, నివాస, ఆదాయ, జనన, మరణ సర్టిఫికెట్‌లతో పాటు మేరేజ్ సర్టిఫికెట్, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యుటేషన్ కరెక్షన్, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్, ఆధార్ మొబైల్ లింకింగ్‌తో పాటు ఇతర సేవలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందించనున్నట్లు వివరించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. ఈ సర్టిఫికెట్‌లు అవసరమైన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసి వాటిని గ్రామాల్లో పర్యటించే తహసీల్దార్ లేదా ఎంపీడీవో బృందాలకు అందించాలని తెలిపారు.

అనంతరం ఆయన రైతులతో భూముల రీసర్వే కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. డీ–పట్టాలు గల రైతుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సూదివలస గ్రామంలో స్పందనలో వచ్చిన సమస్యలు, వాటికి చూపిన పరిష్కారాలను పంచాయతీ కార్యదర్శి ప్రవీణను అడిగి తెలుసుకొని, స్పందన రిజిస్టర్‌ను పరిశీలించారు. సూదివలస కొత్త చెరువు గట్టు పటిష్ట పనులను పరిశీలించారు. చెరువు గట్టుపై కొబ్బరి మొక్కను నాటారు. మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఎంపీడీవో కె.శచీదేవి, సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు, అధికారులు పాల్గొన్నారు.

కొరువాడలో పర్యటన

కొరువాడలో గల విశాఖ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ అండ్ కేర్ ఆఫ్ యానిమల్స్ కేంద్రాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పరిశీలించారు. గోబర్ధార్ పథకంలో భాగంగా బయోగ్యాస్ ఏర్పాటుకు గల అనుకూలతలను గుర్తించేందుకు ఈ కేంద్రాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ప్రసాదరావు, ఏడీ బైరాగి, పశువైద్యాధికారి నాయుడు ఉన్నారు.

సమాజానికి సంజీవిని యోగా

- కేంద్ర మంత్రి మురళీధరన్



కేంద్రమంత్రి మురళీధరన్‌కు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

అనకాపల్లి రూరల్: నేటి సమాజంలో చాలా మంది ఒత్తిళ్లకు గురవుతున్నారని, వాటిని జయించడానికి ఏకైక మార్గం యోగా మాత్రమేనని కేంద్ర విదేశీ వ్యవహారాలు, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి మురళీధరన్ అభిప్రాయపడ్డారు. బుధవారం సిరసపల్లిలోని చింతామణి గణపతి దత్తక్షేత్రంలో నిర్వహించిన 9వ ప్రపంచ యోగా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ కృషి వల్ల జూన్ 21వ తేదీని ఐక్యరాజ్యసమితి ప్రపంచ యోగా దినోత్సవంగా ప్రకటించిందని చెప్పారు. ప్రపంచం మొత్తం యోగా సాధన చేస్తోందన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఒక సంజీవినిగా ఉపయోగపడుతుందని చెప్పారు. కోవిడ్ సమయంలో తాను కూడా యోగ సాధన చేయడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందానని తన స్వీయ అనుభవాన్ని చెప్పారు. దేశ భవిష్యత్ కాబోయే పౌరులైన విద్యార్థులపైనే ఆధారపడివుందన్నారు. దత్త గణపతి క్షేత్రంలో గణపతికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆశ్రమ నిర్వాహకులు కేంద్రమంత్రిని సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, సెయిల్ స్వతంత్ర డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు

మహారాణిపేట (విశాఖ): వైద్య ఆరోగ్య శాఖలో ప్రాంతీయ స్థాయిలో బుధవారం పలువురికి బదిలీలు జరిగాయి. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు కేటగిరీల్లో సీనియర్ అసిస్టెంట్లు 62 మందికి బదిలీలు చేశారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం జిల్లా, ఏఎస్‌ఆర్ జిల్లాల్లో సీనియర్ అసిస్టెంట్లకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పి.ఉమాసుందరి ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ బదిలీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఒక ఉద్యోగ సంఘం నాయకులు కోర్టు ఆర్డర్ తీసుకొచ్చి బదిలీలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పి.ఉమాసుందరి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్‌కు అందజేశారు. అయితే అప్పటికే బదిలీల వ్యవహారం పూర్తి అయిపోవడంతో తాము ఏమీ చేయలేమని ఉద్యోగ సంఘం నాయకులకు అధికారులు తెలియజేశారు. దీంతో ఉద్యోగ సంఘం నాయకులు అక్కడ నిరసన తెలిపారు.

- వైద్య ఆరోగ్యశాఖలో ఉమ్మడి విశాఖ జిల్లాలో కూడా ఉద్యోగుల బదిలీలు బుధవారం జరిగాయి. విశాఖపట్నం, అనకాపల్లి, ఏఎస్‌ఆర్ జిల్లాల్లో పలు కేటగిరీల్లో మొత్తం 53 మందిని బదిలీ చేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 11 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఏడుగురు ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్లు, 15 మంది అటెండర్లు, ఐదుగురు స్వీపర్లు, ఒక టైపిస్టుకు బదిలీ చేశారు.

ఏఎంసీ వార్షిక క్రీడాపోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: పేస్–23 పేరిట నిర్వహిస్తున్న ఏఎంసీ వార్షిక క్రీడా పోటీలు బుధవారం మేజర్ ఎడ్విన్ స్మారక గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఏఎంసీ సెంటినరీ వేడుకల్లో భాగంగా జరుగుతున్న ఈ పోటీలను ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. స్టూడెంట్స్‌కు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నిస్, టీటీ, చెస్, క్యారమ్ పోటీలు, ఫ్యాకల్టీకి క్రికెట్, త్రోబాల్, చెస్, క్యారమ్, టీటీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు.

సాంకేతిక లోపంతో రిజిస్ట్రేషన్లకు అంతరాయం

- ఈకేవైసీ సమస్యతో నిలిచిన క్రయవిక్రయాలు
- రోజంతా కార్యాలయం వద్ద కక్షిదారుల పడిగాపులు



ఈకేవైసీ కోసం క్యూలో వేచి ఉన్న కక్షిదారులు

నక్కపల్లి : సాంకేతిక లోపం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బుధవారం రిజిస్ట్రేషన్లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కక్షిదారులకు సంబంధించి ఈకేవైసీలో ఏర్పడ్డ సమస్యలతో ఉదయం నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. లావాదేవీల కోసం వచ్చిన కక్షిదారులు చాలా ఇబ్బంది పడ్డారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకోసం రోజంతా పడిగాపులు పడాల్సి వచ్చింది. జిల్లావ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోను ఇదే సమస్య నెలకొంది. ఉదయం నుంచి ఆస్తుల క్రయవిక్రయాలను చేసుకుని రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వందలాది దస్తావేజులు పెండింగ్‌లో ఉండిపోయాయి. లావాదేవీలకు ఈకేవైసీ(ఆధార్ అనుసంధానం) తప్పనిసరి కావడంతో కక్షిదారులు తమ ఆధార్‌ను బయోమెట్రిక్ ద్వారా అనుసంధానం చేసుకునేందుకు కార్యాలయాల్లో బారులు తీరారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో అరగంట పాటు ఈకేవైసీ పనిచేసింది. మళ్లీ సాంకేతిక లోపం తలెత్తడంతో నిలిచిపోయింది. పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించి నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాలకు నక్కపల్లిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. బుధవారం ఒక్కరోజు సుమారు 50 వరకు రిజిస్ట్రేషన్లు ఈకేవైసీ సమస్య కారణంగా నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులు ఈ సాంకేతిక సమస్యను పరిష్కరించిన తర్వాత సబ్‌రిజిస్ట్రేషన్ల ప్రక్రియ యథావిధిగా కొనసాగిస్తామన్నారు. క్యూలో ఉన్నవారందరికి టోకెన్లు జారీ చేశామన్నారు. సాంకేతిక సమస్య పరిష్కరించిన తర్వాత ప్రాధాన్యతా క్రమంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయనున్నట్టు పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ విషయంలో.. కేంద్రంపై దుష్ప్రచారం తగదు

- మేధావుల సమావేశంలో ఎంపీ జీవీఎల్ నర్సింహారావు



బీజేపీ తొమ్మిదేళ్ల పరిపాలనపై బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్ నర్సింహారావు

అనకాపల్లి రూరల్: స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కొందరు లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం అందరికీ ప్రయోజనం చేకూర్చే నిర్ణయమే తీసుకుంటుందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు అన్నారు. బుధవారం ఆలోచనా స్వచ్ఛంద సంస్థ తొమ్మిదేళ్ల కేంద్ర ప్రభుత్వ సేవా సుపరిపాలనపై మేధావుల సమావేశం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ జీవీఎల్ నర్సింహారావు మాట్లాడుతూ.. పలు వర్గాలకు చెందిన మేధావులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై పలువురు ప్రశ్నించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ కేంద్రం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతుందని, వారిని రోడ్డున పడేసే ప్రసక్తే వుండదన్నారు. ప్రైవేటీకరణ అనేది ఏకపక్షంగా జరగదని, అందరి మనోభావాలను పరిగణనలోనికి తీసుకుని, ఎవరికీ అభ్యంతరం లేని విధంగా కేంద్రం చర్యలు చేపడుతుందని చెప్పారు. ఇందులో సంస్థ అధ్యక్షుడు గండి వెంకట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సూర్యనారాయణరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, చదరం నాగేశ్వరరావు, పలువురు వైద్యులు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, టీచర్లు, వ్యాపారస్తులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

కంచె చేను మేసింది..

- పప్పుశెట్టిపాలెం ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాలు
- కాపలా కాసిన హోంగార్డు ప్రోద్బలంతో కార్యకలాపాలు
- అతనితోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు



గత ఏడాది తవ్వకాలు జరగకుండా క్వారీ ప్రాంతంలో కాంక్రీట్ వేసిన దృశ్యం (ఫైల్)

గొలుగొండ: కంచె చేను మేసింది. రంగురాళ్ల తవ్వకాలు జరగకుండా చూసేందుకు డ్యూటీ వేసిన హోంగార్డే అందుకు పూనుకోవడం కలకలం రేపింది. విచారించిన పోలీసులు అతనితోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం పప్పుశెట్టిపాలెం క్వారీ వద్ద నర్సీపట్నానికి చెందిన హోంగార్డుతోపాటు కానిస్టేబుల్‌ను కాపలా వేశారు. కానిస్టేబుల్ రావడం కాస్త ఆలస్యం కావడంతో హోంగార్డు సతీష్ పప్పుశెట్టిపాలేనికి చెందిన ఇద్దరు వ్యక్తులతో కలిసి రంగురాళ్ల తవ్వకాలు చేపట్టాడు. డ్యూటీకి వచ్చిన కానిస్టేబుల్ ఈ విషయాన్ని గొలుగొండ పోలీసులకు తెలపడంతో గొలుగొండ ఎస్ఐ నారాయణరావు విచారణ చేపట్టారు. ఇక్కడ గత ఏడాది రంగురాళ్ల క్వారీ బయటపడటంతో తవ్వకాలు జరగకుండా క్వారీ ప్రాంతాల్లో కాంక్రీట్ పనులు చేయించారు. తరువాత ఏడాది నుంచి పోలీసులు కాపలా ఏర్పాటు చేశారు. కాపలాకు వచ్చిన హోంగార్డు చేసిన నిర్వాకంపై ఎస్ఐ నారాయణరావును 'సాక్షి' సంప్రదించగా.. తవ్వకాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేశామని, హోంగార్డు, ఇద్దరు గ్రామస్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం హోంగార్డు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

దివ్యాంగులకు అండగా



దివ్యాంగురాలికి వాహనం అందిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి (ఫైల్)



వాహనాలు అందుకున్న దివ్యాంగులు (ఫైల్)

- మూడు చక్రాల మోటార్ వాహనాల పంపిణీ
- ఒక్కో వాహనం విలువ రూ.లక్షా 20 వేలు

తుమ్మపాల : దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ప్రస్తుతం ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తోంది. అంగవైకల్యంతో బాధపడుతున్న వారికి ఇటు ఉద్యోగ కల్పన, అటు రుణ సౌకర్యం అందిస్తూ వారి కాళ్ల మీద వారు నిలిచేలా ఎప్పటికప్పుడు సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించడంలో వారి వ్యయప్రయాసలకు చెక్ పెట్టే చర్యలు చేపట్టింది. ఇందుకోసం దివ్యాంగ సంక్షేమ శాఖ ద్వారా వారికి మూడుచక్రాల మోటారు సైకిళ్లు అందిస్తోంది.

వాహనం విలువ రూ.1.20 లక్షలు

జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో ఉన్న దివ్యాంగులకు మూడుచక్రాల మోటారు సైకిళ్ల కోసం దరఖాస్తులను స్వీకరించింది. రూ.లక్షా 20 వేల విలువ చేసే మూడు చక్రాల మోటారు వాహనాలను అందించేందుకు సంక్షేమ శాఖకు ఆదేశాలిచ్చింది. నియోజకవర్గానికి 10 వాహనాల చొప్పున ఎంపిక చేశారు. జిల్లాలో అనకాపల్లిలో ఈ నెల 17న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి వెంకట సత్యవతిల చేతుల మీదుగా తొలి విడత పంపిణీ జరిగింది. అనకాపల్లి, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన 20 మంది దివ్యాంగులకు మోటారు సైకిళ్లను అందించారు. మరో 50 వాహనాలను జూలై నెలలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల చేతుల మీదుగా దివ్యాంగులకు పంపిణీ చేసేందుకు సంక్షేమ శాఖ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

వాహనాల కోసం 149 దరఖాస్తులు

జిల్లాలో 149 మంది దివ్యాంగులు వాహనాల కోసం దివ్యాంగ సంక్షేమశాఖకు దరఖాస్తులు చేసుకున్నారు. 96 దరఖాస్తులను సదరు శాఖ ఎంపిక చేసింది. ప్రస్తుతానికి 70 వాహనాల పంపిణీకి ఏర్పాట్లు చేసింది. వీటిలో ఇప్పటికే 20 వాహనాలను అందించారు. మరో 50 వాహనాలు అందించాల్సి ఉంది.

చాలా ఆనందంగా ఉంది



వాహనం మంజూరు కావడంతో చాలా ఆనందంగా ఉంది. గతంలో ఎక్కడికైనా వెళ్లాలంటే మరొకరి సహాయం అవసరమయ్యేది. ఇప్పుడు నా అంతట నేనుగా బయటకెళ్లి పనులు చక్కబెట్టుకుంటున్నా. అనకాపల్లి కలెక్టరేట్‌లో వాహనం కోసం దరఖాస్తు చేసుకున్నా. సంక్షేమ శాఖ ఇటీవల నాకు వాహనం మంజూరు చేసింది.

– పెంట సన్యాసి, దివ్యాంగుడు, అనకాపల్లి

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అర్హులైన దివ్యాంగులకు సీఎం జగన్ ప్రభుత్వం మూడు చక్రాల మోటారు సైకిల్‌ను ఉచితంగా అందిస్తోంది. జిల్లాలో 96 దరఖాస్తులు తుది పరిశీలనలో ఎంపికయ్యాయి. తొలి విడతలో 70 వాహనాలను పంపిణీ చేస్తున్నాం. ఇప్పటికే 20 అందించాం. మిగిలిన 50 వాహనాలు వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు చేశాం.

– బి.వి.జగదీష్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖాధికారి

క్లుప్తంగా

గంజాయి రవాణా నిర్మూలనకు చర్యలు

• ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్ : జిల్లాలో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. తన కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ 35 గంజాయి కేసులు నమోదు చేసి 80 మందిని అదుపులోకి తీసుకొని 885.62 కేజీల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి విలువ రూ.17లక్షల 51వేల 800 ఉంటుందని చెప్పారు. 13 వాహనాలను, 55 సెల్‌ఫోన్ల, రూ.40,800 నగదు స్వాధీనపరుచుకున్నామని తెలిపారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు వి.మాడుగుల మండలంలో తాటిపర్తి గ్రామం, చీడికాడ మండలంలో కోనాం గ్రామం, నర్సీపట్నం రూరల్లో డౌనూరు గ్రామం, కేడీ పేటలో భీమవరం గ్రామం వద్ద మొత్తం 4 అనుమతి గల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, అదనంగా మరో 11 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, వివిధ ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేయనున్నామన్నారు. ఒక వ్యక్తిపై పీడీ కేసు నమోదు చేశామన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు 138 కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు 17 ప్రధాన కూడళ్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఇంటింటా సర్వే

తుమ్మపాల: కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి ఇంటింటా సర్వే నిర్వహించాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఎల్సీడీసీ క్యాంపెయిన్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి వచ్చేనెల 16 వరకు ఇంటంటా సర్వే చేయాలన్నారు. కుష్టువ్యాధి లక్షణాలతో బాధపడుతున్నవారు తప్పనిసరిగా సర్వేలో ఆరోగ్య కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలన్నారు. కేంద్ర ఆరోగ్య కార్యకర్త వద్ద ఎంపీడీ మందులు ఉంటాయని, అవసరమైతే ఆరోగ్య కార్యకర్త వద్దకు వెళ్లి ఉచితంగా మందులు తీసుకోవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో సర్వేను జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ హేమంత్, జిల్లా లెప్రసీ అధికారి శారదాబాయి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ దూరప్రాంత సర్వీసులకు 10 శాతం రాయితీ

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ఏపీఎస్ ఆర్టీసీ దూర ప్రాంత సర్వీసుల్లో రానుపోను టికెట్ ముందుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు టికెట్ చార్జీలో 10 శాతం రాయితీ పొందే సదుపాయం కల్పిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా గాని, ద్వారకా బస్‌స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ ద్వారా కూడా రాను పోను టికెట్ రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

దారిదోపిడీ కేసులో నిందితుల పట్టివేత

• 9 మందికి 14 రోజుల రిమాండ్
• పరారీలో ఒకరు
• కేసును ఛేదించిన గ్రామీణ పోలీసులు
• డీఎస్పీ, సీఐ, పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ మురళీకృష్ణ



డీఎస్పీ సుబ్బరాజుకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ సత్యనారాయణరావు

అనకాపల్లిటౌన్: దారి దోపిడికి పాల్పడిన 10మంది వ్యక్తులపై కేసు నమోదు చేయగా ఒక వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడారు. విశాఖ పూర్ణామార్కెట్ వేలంపేటకు చెందిన ముప్పిడి మహేష్, తండ్రి రాంబాబులు వృత్తిరీత్యా బట్టలవ్యాపారం చేస్తారని ఆయన చెప్పారు. ఈనెల 19న వేలంపేట నుంచి అల్లూరి సీతారామరాజుజిల్లా పెదబయలులో జరిగే వారపు సంతలో బట్టలు విక్రయించేందుకు మహేష్ వ్యాన్‌లో తండ్రి రాంబాబు, వర్కర్ సతీష్, వ్యాన్‌డ్రైవర్ నాగరాజులు కలిసి వెళ్లినట్లు తెలిపారు. అక్కడ వ్యాపారం ముగించుకొని అదేరోజు సాయంత్రం 3.30 నిమిషాలకు పెదబయలు నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ వెళ్లేందుకు నిర్ణయించుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. పాడేరు దాటిన తర్వాత అనకాపల్లి గవరపాలేనికి చెందిన యల్లపు నూకేష్, మొల్లేటి లోకేష్‌లు ద్విచక్రవాహనంపై రాంబాబు వ్యాన్‌ను వెంబడించినట్లు తెలిపారు. వెంకన్నపాలెం కూడలి దాటే సమయంలో మరోమూడు ద్విచక్ర వాహనాలపై మొత్తం 10 మంది వ్యాన్ వెనుకవచ్చారని చెప్పారు. అనకాపల్లి మండలం బవులవాడ గ్రామానికి రాత్రి 7.15 నిమిషాలకు చేరుకున్న సమయంలో 10 మంది వ్యాన్‌ను ముందు బైక్‌లతో నిలిపివేశారని చెప్పారు. వ్యాన్‌లో నలుగురిని కిందికి దించి గంజాయి ఏమైనా రావాణా చేస్తున్నారా అంటూ ప్రశ్నించి వ్యాన్‌ను దౌర్జన్యంగా తనిఖీ చేసినట్లు ఆయన చెప్పారు. పట్టణంలో గవరపాలేనికి చెందిన కొణతాల దివాకర్ వ్యాన్ నాగరాజును పక్కకు జరిపి దివాకర్ డ్రైవింగ్ చేస్తూ నలుగురితో అనకాపల్లి డైట్ కళాశాలకు ఎదురుగా ఉన్న నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతంలో వ్యాన్‌ను నిలిపివేసినట్లు ఎస్పీ చెప్పారు. మిగిలిన తొమ్మిది మంది వ్యాన్ ఫాలో అవుతూ వచ్చి వ్యాన్ నుంచి బట్టలు, వ్యాపారులు రాంబాబు, మహేష్, సతీష్, నాగరాజుల నుంచి రూ.20 వేలు నగదు అపహరించి పదిమంది పరారైనట్టు ఎస్పీ చెప్పారు. ఈ మేరకు మంగళవారం రాత్రి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. గవరపాలేనికి చెందిన యల్లపు నూకేష్, మొల్లేటి లోకేష్, కర్రి పూర్ణదర్శిక్, దామరౌతు మోహన్, శరగడం మహేంద్రకుమార్, పొలమరశెట్టి లోకేష్, నర్సీపట్నానికి చెందిన నీలంపేట గ్రామానికి చెందిన వీశంశెట్టి భరద్వాజ్, స్థానిక నెయ్యిలవీధికి చెందిన దుప్పాడ అనిల్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్పీ చెప్పారు.

స్థానిక విజయరామరాజుపేటకు ఏఎంసీ కాలనీకి చెందిన ఎర్రంశెట్టి వంశీ పరారీ ఉన్నాడని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఎస్పీ చెప్పారు. నిందితుల నుంచి మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. 24 గంటల్లో కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్న డీఎస్పీ సుబ్బరాజు, రూరల్ సీఐ రవికుమార్, పోలీసు సిబ్బందిని ఎస్పీ మురళీకృష్ణ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ క్రైం ఎస్పీ సి.సత్యనారాయణరావు ఉన్నారు.

నిత్యజీవితంలో యోగా భాగం కావాలి



యోగా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

• కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: యోగా నిత్యజీవితంలో ఓ భాగం కావాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక రాజీవ్‌గాంధీ ఇండోర్‌స్టేడియంలో ఆయుష్మాన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 9వ ప్రపంచ యోగా దినోత్సవంలో కలెక్టర్, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడిని జయించవచ్చని చెప్పారు.

ఈశ్వరీయ బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో జరిగిన ధ్యానంలో పాల్గొని, అనంతరం యోగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో పి.వెంకటరమణ, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, ఎన్టీఆర్ వైద్యాలయ సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జ్యోతి, స్పోర్ట్స్ అథారిటీ చీఫ్‌కోచ్ ఆనందలక్ష్మి, డీఎల్‌వో శారదాబాయి, 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, ఆయుర్వేద వైద్యనిపుణులు కె.లావణ్య, ఎం.అరుణ్, పి.ఎస్. వినయ్‌కుమార్, డాక్టర్ శిరీష, బి.జయలక్ష్మి, పి.పద్మ, స్వర్ణలత, రామలక్ష్మి, కళావతి, మున్సిపల్ జోనల్ కమిషనర్ వెంకటరమణ, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై విస్తృతంగా అవగాహన

• జేసీ జాహ్నవి



జగనన్న సురక్ష పై అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కలెక్టర్ జాహ్నవి

కొంకోట: జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జేసీ జాహ్నవి ఆదేశించారు. మండలంలోని తేగాడ సచివాలయాన్ని బుధవారం సందర్శించారు. జగనన్న సురక్ష కార్యక్రమం అమలుకు ఈ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. దీంతో కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు జేసీ ఆ గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు మరింత చేరువయ్యేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు తక్షణమే జారీ చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జగనన్నకు చెబుదాం, స్పందనలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీసి సమీక్షించారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు ఏనుగుతుని గ్రామంలో భూముల రీ- సర్వే పనులను జేసీ పరిశీలించారు. సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఉప తహసీల్దార్ సురేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాద మృతుల కుటుంబాలకు బీమా సాయం



బీమా సహాయం అందచేస్తున్న దృశ్యం

చోదవరం రూరల్: కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి ప్రాంతంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు బుధవారం వైఎస్సార్ బీమా సాయాన్ని అందజేశారు. ఈ ప్రమాదంలో బోడి వెంకట రమణ, గంగిరెడ్ల శ్రీను, పతివాడ కన్నయ్యలింగం, బోడి వెంకునాయుడు, బోడి సత్యనారాయణలు మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా ముందురోజు గ్రామానికి చెందిన బొచ్చా గణపతి మరణించాడు. ఈ ఆరుగురి కుటుంబాలకు వైఎస్సార్ బీమా సాయం బుధవారం పంపిణీ చేశారు. ఒక్కొక్క కుటుంబానికి పదివేల చొప్పున తక్షణ సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.లక్ష్మి వెంకట్, ఎంపీటీసీ పల్లా రమణ, సచివాలయ కన్వీనర్ మోసూరి శ్రీనివాసరావు, అప్పలస్వామినాయుడు, ఎస్.శ్రీను, బోడి సూరిబాబు, సచివాలయ వెల్ఫేర్ ఆఫీసర్ అసిస్టెంట్ సుగుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పశుబీమా పథకంపై అవగాహన కల్పించాలి

• జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రసాదరావు

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ పశుబీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించి, పశువులకు బీమా చేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బి.ప్రసాదరావు తెలిపారు. ఆర్బీకేల్లో పనిచేస్తున్న పశుసంవర్ధకశాఖ సహాయకులతో కె.కోటపాడులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, పందులు మరణిస్తే ఈ పథకం కింద వాటి యజమానులకు ప్రభుత్వం పరిహారం అందజేస్తుందని తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని పక్కాగా జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి, నోడల్ అధికారి బానుబాబు, పశువైద్యాధికారులు సీహెచ్.వై.నాయుడు, మౌనిక, అలేఖ్య, మంజూష రాణి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ..ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనాలు

ఎస్.రాయవరం : గుర్రాజుపేట సమీపంలో రేవుపోలవరం ఆర్అండ్‌బీ రోడ్డుపై రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఎస్.రాయవరం పోలీసులు అందించిన వివరాలివి. ఎస్.రాయవరం మండలం పెదఉప్పలం గ్రామానికి చెందిన అడబాల నవీన్ అడ్డురోడ్డు నుంచి పెద ఉప్పలం వెళుతుండగా కొయ్యూరు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎ. విశాల్ ఎదురుగా బైకుపై వస్తూ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మెరుగైన సేవలు

• ట్రైనీ కలెక్టర్ ధాత్రిరెడ్డి



సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్న ట్రైనీ కలెక్టర్ ధాత్రి రెడ్డి

నర్సీపట్నం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ట్రైనీ కలెక్టర్ ధాత్రిరెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలో యరకన్నపాలెం సచివాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం అమలుకు యరకన్నపాలెం సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు చెప్పారు. ఎంపీడీవో జయమాధవి, తహసీల్దార్ అన్నాజీరావు, సర్పంచ్ కశిరెడ్డి నారాయణమ్మ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ శానపతి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు తొలగింపు అవాస్తం

• ఆర్డీవో హెచ్.వి.జయరాం



నర్సీపట్నం: ఓట్లు తొలగించారని వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని రెవెన్యూ డివిజనల్ అధికారి హెచ్.వి. జయరాం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మరణించిన, వలసవెళ్లిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీలు ఉంటే ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లను చేర్చడంతో పాటు తొలగింపు, డబుల్ ఎంట్రీలు తగిన జాగ్రత్తలు పాటిస్తున్నామని చెప్పారు. నాతవరం మండలం, మర్రిపాలెంలో రంబా రాంబాబు, వై.డి.పేటలో బంగారు స్వామి, చెట్టుపల్లిలో కామిరెడ్డి అర్జున్, మున్సిపాలిటీలో గవిరెడ్డి లక్ష్మి ఓట్లు గల్లంతయ్యాయనడంలో వాస్తవం లేదన్నారు. రెండు, మూడు డబుల్ ఎంట్రీలు ఉన్నాయన్నారు. ఈ నెల 21 నుంచి ఇంటింటికీ వెళ్లి నిర్ధారణ చేసి తొలగిస్తామన్నారు.

సమన్వయంతో సింహ'గిరి ప్రదక్షిణ'

• వచ్చేనెల 2, 3 తేదీల్లో గిరి, ఆలయ ప్రదక్షిణలు
• లక్షన్నర మందికి పైగా భక్తులు వస్తారని అంచనా
• ఆషాఢ పౌర్ణమి రోజున నిరంతర అన్నప్రసాదం
• కలెక్టర్ మల్లికార్జున సూచనలు



విభాగాధిపతులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్‌వర్మ

సాక్షి, విశాఖపట్నం: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని వచ్చే నెల 2, 3 తేదీల్లో సింహగిరి, ఆలయ ప్రదక్షిణలను సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమన్వయ సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిప్రదక్షిణ రోజున 70 వేల మందికి పైగా భక్తులు, ఆషాఢ పౌర్ణమి రోజున లక్షకు పైచిలుకు భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. 2 లక్షల మందికి సరిపడా ఏర్పాట్లు చేయాలని సూచించారు. 3న ఉదయం నుంచి నిరంతరం స్వామివారి అన్నప్రసాదం భక్తులకు అందించాలని ఆదేశించారు. కొండ చుట్టూ షామియానాలతో ఏర్పాట్లు చేసి.. ప్రతి స్టాల్‌లోనూ టేబుల్స్, కుర్చీలు, మంచినీటి డ్రమ్ములు, మజ్జిగ, తాగునీటి ప్యాకెట్స్, సౌండ్ సిస్టం, లైటింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాల వద్ద ఒక ఏఎన్ఎం, ఆశ కార్యకర్తని షిఫ్ట్ పద్ధతిలో ఉంచాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. గిరి ప్రదక్షిణ జరిగే మార్గంలో ప్రైవేట్, ప్రభుత్వ అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. పారిశుధ్యం, టాయిలెట్స్ నిర్వహణకు అదనపు సిబ్బందిని నియమించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. రాత్రి సమయంలో గిరి ప్రదక్షిణ మార్గంలో తగినంత లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు సేవలు అందించే స్వచ్ఛంద సంస్థలు ముందుగా దేవస్థానం అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూలైన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. దేవస్థానం అధికారులు తమ సిబ్బందిని ప్రతిచోట కార్యక్రమానికి ఆరు గంటల ముందుగానే ఉండేటట్టు ప్రణాళిక చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తగిన సంఖ్యలో బస్సులు అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ అధికారులను ఆయన ఆదేశించారు. ఈపీడీసీఎల్ అధికారులు గిరి ప్రదక్షిణ జరిగే మార్గంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు.


సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో భ్రమరాంబ మాట్లాడుతూ ఈ ఏడాది జరిగే వార్షిక ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. దర్శనానంతరం భక్తులను ఉచితంగా కొండపైకి, కిందకు దించేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, దేవాదాయశాఖ సిబ్బంది, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆ రెండు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు

పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ గిరి ప్రదక్షిణకు పోలీసులతో పాటు ఎస్డీఆర్ఎఫ్, మెరైన్ పోలీసులు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆ రెండు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. పాత గోశాల, గోపాలపట్నం నుంచి వచ్చే వాహనాలకు పాత గోశాల తరువాత అనుమతి లేదని తెలిపారు. శొంఠ్యాం నుంచి వచ్చే వాహనాలకు అడవివరం వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. అడవివరం నుంచి తొలి పావంచా చేరే భక్తులు కోనేరు మీదుగా కలశం జంక్షన్ చేరి అక్కడి నుంచి రావాలని సూచించారు. హనుమంతవాక, జోడుగుళ్లపాలెం దారిలో ఇరుకు మార్గం కారణంగా దాతలు స్టాళ్లు ఏర్పాటు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. జోడుగుళ్లపాలెం వద్ద సముద్ర అలల ఉధృతి అధికంగా ఉన్న కారణంగా స్నానాలకు అనుమతి లేదని సీపీ స్పష్టం చేశారు. లుంబిని పార్క్ దగ్గర స్నానాలకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆ రెండు రోజులు ప్రదక్షిణ మార్గంలోని మద్యం షాపులు, బార్లు మూసివేయనున్నట్టు ప్రకటించారు.

మహిళ హత్య కేసులో ఐదుగురు అరెస్టు

• వివరాలు వెల్లడించిన పాడేరు సీఐ సుధాకర్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సుధాకర్, ఎస్ఐ లక్ష్మణ్‌రావు, తహసీల్దార్



పూడ్చి పెట్టిన ప్రదేశంలో మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

పాడేరు రూరల్ : మండలంలోని వనుగుపల్లి పంచాయతీ తియ్యగెడ్డ గ్రామంలో హత్యకు గురైన మహిళ కేసును పోలీసులు మూడు రోజుల వ్యవధిలోనే ఛేదించారు. ఈ సంఘటనలో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జి.మాడుగుల మండలం కొరాపల్లి గ్రామానికి చెందిన కొర్రాబు బోడకొండమ్మ అలియాస్ గాయత్రిని అదే పంచాయతీ రూడిబయలు గ్రామానికి చెందిన పాంగి గణపతి అనే వ్యక్తి మూడో భార్యగా పెళ్లి చేసుకునేందుకు పాడేరు మండలం తియగెడ్డ గ్రామంలో తన పిన్ని ఇంటికి తీసుకువెళ్లాడు. బోడకొండమ్మ అనారోగ్యంతో మృత్యువాత పడిందని దహన సంస్కారాలు పూర్తి చేశామని బోడకొండమ్మ తండ్రి కొరాబు త్రిమూర్తికి గణపతి తెలిపాడు. దీంతో అనుమానం వచ్చిన త్రిమూర్తి ఈ నెల 18న పాడేరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ లక్ష్మణరావు ఈ నెల 19న తియగెడ్డ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని పాతి పెట్టిన ప్రదేశాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పాతి పెట్టిన చోట పైన కట్టెలతో కప్పినట్టు గుర్తించిన ఎస్ఐ లక్ష్మణరావు విషయాన్ని సీఐ సుధాకర్‌కు నివేదించారు. సీఐ సుధాకర్ పాడేరు తహసీల్దార్‌ను వెంట పెట్టుకొని సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి మెడ చుట్టూ ఉరి వేసిన గుర్తులు ఉండడాన్ని చూసి హత్య కేసుగా నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పలు విషయాలు వెలుగు చూసాయి. మొదటి నిందితుడు పాంగి గణపతికి గతంలోనే రెండు పెళ్లిళ్లు అయ్యాయి. మృతురాలిని మూడో భార్యగా చేసుకుంటానని చెప్పి ఒంగోలులో ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ ఆమెతో సహజీవనం చేశాడు. మృతురాలు గణపతిని తన తల్లిదండ్రుల ఇంటికి తీసుకువెళ్లమని చెప్పడంతో ఈ నెల 14న తియగెడ్డ గ్రామంలో గల తన పిన్ని ఇంటికి తీసుకువచ్చాడు. అక్కడ కూడా ఉండడానికి ఇష్టపడని బోడకొండమ్మ తాను కొరాపల్లిలో తన తల్లిదండ్రుల వద్దకు వెళ్తానని చెప్పింది. అయితే ఆమె ఎక్కడికీ వెళ్లడానికి వీలు లేదని, తనతో ఉండకపోతే చంపేస్తానని గణపతి బెదిరించాడు. అతని మాట వినని బోడకొండమ్మ ఈ నెల 16న ఉదయం 7గంటలకు కొరాపల్లి గ్రామానికి వెళ్లేందుకు సిద్ధపడుతూ ఉండగా ఆమెను చున్నీతో మెడ చుట్టూ గట్టిగా లాగి హత్య చేశాడు. అనంతరం విషయాని తన కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారి సహకారంతో మృతదేహాన్ని గ్రామ శివారులో పాతి పెట్టి సాక్షాలు లేకుండా ప్రయత్నం చేశాడు.

ఈ సంఘటనలో జి.మాడుగుల మండలం కొరాపల్లి పంచాయతీ రూడిబయలు గ్రామానికి చెందిన పాంగి గణపతి, అతనికి సహకరించిన అదే గ్రామానికి చెందిన పాంగి శోభన్, పాంగి మహేష్‌బాబు, పాంగి లక్ష్మమ్మ, పాంగి భారతిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సాక్షి అనకాపల్లి

శుక్రవారం | 23 | జూన్ | 2023



రౌడీషీటర్ హత్య

అనకాపల్లి మండలంలో తలదాచుకున్న విశాఖకు చెందిన రౌడీ షీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. 8లో



ఎన్నాళ్లో వేచిన ఉదయం

వందేళ్ల నాటి రోడ్డు సమస్యకు మోక్షం లభించింది. ఆరిల్లోవ రోడ్డు పనులు పండగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. 8లో



జీలుగులోవలో విషజ్వరాలు

కల్యాణపులోవ రిజర్వాయర్ పరివాహక ప్రాంతమైన శివారు కొండపై పలువురికి విషజ్వరాలు సోకాయి. 8లో

న్యూస్‌రీల్

వరాహ రూపంలో జగన్నాథుడు



వరాహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

అనకాపల్లిటౌన్: స్థానిక గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్న హాల్లో దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు.

ఆర్టీసీ అడ్వాన్స్ బుకింగ్‌పై 10 శాతం రాయితీ

నర్సీపట్నం: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ముందుగా టిక్కెట్లు బుకింగ్ చేసుకునే ప్రయాణికులకు టికెట్ ధరలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.ఎస్.ఎస్.ధీరజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చిందన్నారు. ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో దూర ప్రాంతాలకు వెళ్లే వారు రాను, పోను ప్రయాణానికి ముందుగా టిక్కెట్లు బుకింగ్ చేసుకోవడం ద్వారా ఈ రాయితీ సౌకర్యాన్ని పొందవచ్చన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో మరో 58 మందికి బదిలీ

మహారాణిపేట (విశాఖ): వైద్య ఆరోగ్య శాఖ జోన్ వన్ పరిధిలో గురువారం మల్టీ పర్పస్ హెల్త్ సర్వీస్(ఎంపీహెచ్ఎస్-మేల్), మల్టీ పర్పస్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఎంపీహెచ్ఈవో)లకు కౌన్సెలింగ్ జరిగింది. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ ఉత్తరాంధ్ర జిల్లాలోని ఉద్యోగులకు బదిలీలు చేపట్టారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆదేశాల ప్రకారం ఏపీజీఈఏ ఆఫీస్ బేరర్లకు రిటెన్షన్ (వారి స్థానంలోనే ఉండిపోవడం) అవకాశం ఇచ్చారు. ఎంపీహెచ్(మేల్) క్యాడర్‌లో 9 మంది, ఎంపీహెచ్ఈవో క్యాడర్‌లో 12 మంది రిటెన్షన్ పొందారు. మొత్తంగా గురువారం ఎంపీహెచ్(మేల్)లో 38 మంది, ఎంపీహెచ్ఈవోలో 20 మందికి బదిలీలు జరిగాయి.

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం: అరకు వెళ్లే ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైలుకు ఆయా తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ రైలుకు జూలై 2,4,6,8,10,12,14,16,18,20,22, 24, 26,28,30 తేదీల్లోను, కిరండూల్ -విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలుకు జూలై 3,5,7,9,11,13,15,17,19,21,23,25, 27,29, 31 తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఖరీఫ్‌కు శ్రీకారం

- వర్షాలు కురవడంతో ప్రారంభమైన వరి నారుమడులు
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు
- ఆర్బీకేల్లో ఇప్పటికే జోరుగా విత్తనాల పంపిణీ
- ఈ ఏడాది జిల్లాలో పెరగనున్న వరి విస్తీర్ణం



పల్లం ప్రాంతంలో ఇప్పటికే వేసిన వరి నారుమడి

చోడవరం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పొలం పనులు ముందుగానే ప్రారంభమయ్యాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులంతా నారుమడులు సిద్ధం చేసే పనిలో బిజీ అయ్యారు. గ్రామాలన్నీ వ్యవసాయ పనులతో సందడిగా మారాయి. ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం కూడా పెరగనుంది. సుమారు 5 నుంచి 7 వేల ఎకరాల వరకూ వరి విస్తీర్ణం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. చెరకు, సరుగుడు, ఇతర పంటల స్థానంలో ఈ ఏడాది వరి వేసేందుకు రైతులు ఆసక్తి చూపడంతో జిల్లాలో వరి సాగు ఆశాజనకంగా పెరగనుంది. రాష్ట్రప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులు, సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ సిబ్బందిని అందుబాటులో ఉంచింది. వ్యవసాయ బోర్లు, జలాశయాలు ఆయకట్టు భూముల్లో రైతుల కొందరు తమ వద్ద ఉన్న సొంత విత్తనాలను ఇప్పటికే నారుమడుల్లో సిత్త చేసి జల్లుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 55 వేల హెక్టార్లలో వరి సాగు సాధారణ విస్తీర్ణం కాగా అదనంగా మరో 5 నుంచి 7 వేల ఎకరాల వరకు పెరిగే అవకాశం ఉంది. ప్రతీ గ్రామ ఆర్బీకేల్లోనూ గత ఏడాది కంటే ఈ ఏడాది రైతులు అదనపు విత్తనాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అంతేకాకుండా ఈ ఏడాది సాధారణ రకాల వైపు వెళ్లకుండా బీపీ రకాలైన సోనామసూరి, ఆర్‌జీఎల్ రకాలకే రైతులు ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చారు. గత ఎనిమిదేళ్లుగా జిల్లాలో చెరకు విస్తీర్ణం బాగా తగ్గిపోగా ప్రత్యామ్నాయంగా సరుగుడు, ఇతర పంటలు వేశారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో వరిలో చాలా మంచి దిగుబడి రావడం, ఆర్బీకేలు, పీఏసీఎస్‌ల ద్వారా మిల్లర్లను గ్రామాలకు రప్పించి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా అమ్మిన ధాన్యానికి సకాలంలో రైతుల ఖాతాల్లో మంచి గిట్టుబాటు ధరతో డబ్బులు జమ చేయడంతో రైతుల్లో వరి సాగుపై ఆసక్తి పెరిగింది. పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించడం, వ్యవసాయ పెట్టుబడులకు ఇచ్చే రూ.13,500లలో ఈ ఏడాది మొదటి విడతగా ఇప్పటికే రూ.5500 ఇవ్వడం, గిట్టుబాటు ధర ఇచ్చేందుకు 3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయడం రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. రైతు సంఘాలకు రైతు రథం పేరుతో వ్యవసాయ పనులకు ట్రాక్టర్లను సబ్సిడీపై అందించడంతో వ్యవసాయదారులకు ఎంతో మేలు చేస్తుంది. జిల్లాలో వ్యవసాయాధారిత ప్రాంతమైన చోడవరం, మాడుగుల నియోజకవర్గాలతోపాటు పాయకరావుపేట, నర్సీపట్నం, అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల పరిధిలో చెరకు, సరుగుడు సాగు చేసే భూముల్లో సైతం ఈ ఏడాది వరి సాగు చేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. గతంలో మాదిరిగా కాకుండా ముందుగానే కావలసినంత విత్తనాలను ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. లైసెన్సుతో నడిచే ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో కూడా వరి విత్తనాలు అమ్మకాలు ప్రారంభించారు.

ప్రభుత్వమే గ్రామాలకు వచ్చింది



గతంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందంటే విత్తనాల కోసం వ్యవసాయశాఖ, ప్రైవేటు ఎరువుల దుకాణాల వద్ద రోజుల తరబడి లైన్లలో నిలబడి ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ సమస్యే లేదు. ప్రభుత్వమే గ్రామాల్లోకి వచ్చింది. గ్రామ సచివాలయాలు ఉన్న చోట రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రభుత్వమే విత్తనాలు అందిస్తోంది. ఖరీఫ్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం కింద మొదటి విడతగా డబ్బులు రైతు ఖాతాల్లో జమ చేశారు. ఇంతకంటే రైతుకి ఏమి కావాలి.

– వేచలపు దేముడు, రైతు, లక్కవరం

రైతుల్లో ఉత్సాహం



జిల్లాలో వరి సాగు ఈ ఏడాది పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాం. గ్రామాల్లో వరి వేసేందుకు రైతులు చాలా ఆసక్తి చూపుతున్నారు. చాలా మంది సొంత విత్తనాలు సిద్ధం చేసుకోగా కొత్తగా వరి వేసే రైతులు కూడా ఈ ఏడాది ఆర్బీకేల్లో విత్తనాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. చెరకు, సరుగుడికి ప్రత్యామ్నాయంగా వరిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో నారుమడులు కూడా సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాలు కూడా కావలసిన మేరకు సరఫరా చేశాం.

– బి.మోహనరావు, వ్యవసాయ శాఖ జిల్లా

హర్ ఘర్ జల్ గ్రామంగా చినజగ్గంపేట



చినజగ్గంపేటను హర్ ఘర్ జల్ గ్రామంగా ధ్రువీకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నాతవరం: జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.27 కోట్లతో 137 పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్ చెప్పారు. చిన జగ్గంపేట గ్రామంలో శత శాతం ఇళ్లకు కుళాయిలు వేయడంతో హర్ ఘర్ జల్ గ్రామంగా గురువారం ఎంపీడీవో, సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రకటించామన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో 40 పైగా పనులకు టెండర్లు ఖరారు చేసి ఇంటింటికీ కుళాయి పనులు చేస్తున్నామన్నారు. మిగతా పనులు టెండర్ల ప్రక్రియ దశలో ఉన్నాయన్నారు. కొండల మీదనున్న గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం జల్‌జీవన్ మిషన్ పథకంలో ప్రతిపాదనలు చేశామని, అవి కూడా టెండర్ల దశలో ఉన్నాయన్నారు. చిన జగ్గంపేట గ్రామంలో ప్రపంచ బ్యాంకు నిధులతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. తర్వాత జగనన్న లేఅవుట్లలో తాగునీటి కోసం బోర్లు ఏర్పాటు చేసి నీటి సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. ఎంపీడీవో హనుమంతరావు, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఇన్‌చార్జి జీవోపీఆర్‌డీ చినబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

విద్యా విప్లవం... సంస్కరణల పథం

ఫ్యాక్ట్ చెక్

పిల్లలకు మనమిచ్చే ఆస్తి చదువేనని ప్రతి క్షణం నమ్మి విద్యా రంగంలో ఎవరూ ఊహించని విధంగా మార్పులు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి సత్ఫలితాలు ఇస్తోంది. ఈ ఏడాదిలో పది, ఇంటర్ ఫలితాల్లో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పదిలో స్టేట్ టాపర్లుగా అచ్యుతాపురానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థిని నిలవడం గమనార్హం. రాష్ట్రంలో కార్పొరేట్ స్కూళ్లలో సైతం కొన్నింటికి మాత్రమే అందుబాటులో ఉన్న ఎడ్యుటెక్ విద్యను 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అందరికీ అందుబాటులోకి తీసుకొస్తూ, ద్విభాషా పాఠ్య పుస్తకాలను పరిచయం చేస్తూ.. తీసుకున్న చర్యలతో పాఠశాల విద్యలో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది.

–సాక్షి, అనకాపల్లి

- నాణ్యమైన విద్య, సంస్కరణల్లో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ
- శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్, ప్రీ హైస్కూల్, హైస్కూల్, హైస్కూల్ ప్లస్ అమలుకు శ్రీకారం



విద్యా సంస్కరణల్లో భాగంగా సర్కారు బడుల్లో విద్యా బోధన మెరుగుపరిచి నాణ్యమైన విద్య అందించాలనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి ప్రజలు జేజేలు పలుకుతుంటే మరోవైపు పాఠశాలల విలీనంపై ఈనాడు పత్రిక పాఠకులను తప్పుదోవ పట్టిస్తున్నది. నూతన విద్యా విప్లవంలో భాగంగా పాఠశాలల విలీనంతో పాటు, ఉపాధ్యాయుల సర్దుబాటు, వసతుల ఏర్పాటు వంటి చర్యలపై వాస్తవ దూరమైన కథనం ప్రచురించింది. అయితే విద్యాధికారులు, పలు ఉపాధ్యాయ సంఘాలు ఈ విమర్శలను కొట్టిపారేస్తున్నారు.

సాధారణ బదిలీలు..

జిల్లాలో 98 మంది విద్యార్థుల కన్నా తక్కువగా 75 యూపీ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో 350 మంది వరకూ స్కూల్ అసిస్టెంట్‌లున్నారు. వీరిలో కొందరికి సాధారణ బదిలీల్లో భాగంగా స్థాన చలనం అయింది. ఉదాహరణకు అనకాపల్లి మండలం సుందరయ్యపేట ఎంపీయూపీ స్కూళ్లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకూ ఉంది. అక్కడ 77 మంది విద్యార్థులకు నలుగురు ఎస్‌జీటీ టీచర్లు, ఒక స్కూల్ అసిస్టెంట్ (తెలుగు పండిట్) టీచర్ బోధిస్తున్నారు. సాధారణ బదిలీల్లో తెలుగు పండిట్ టీచర్ ఎస్.రాయవరం మండలం రేవు పోలవరం హైస్కూల్‌కి బదిలీపై వెళ్లారు.

నాలుగేళ్లలో ఎన్నో సంస్కరణలు

- నాలుగేళ్ల పాలనలో విద్యావ్యవస్థలో ఎన్నో రకాల సంస్కరణలు, సంక్షేమ పథకాలను ఏపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. పాఠశాలల ప్రారంభం రోజునే జిల్లాలో జగనన్న విద్యా కానుక కిట్లు పేరిట విద్యార్థుల పుస్తకాలు, భోజనం, స్కూలు బ్యాగులు, షూ, యూనిఫారాలు ఇలా అన్నింటిలో నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ అందించింది.
- వరల్డ్ క్లాస్ విద్యా బోధనలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ప్రీలోడెడ్ కంటెంట్‌తో ట్యాబ్‌లను అందించి డిజిటల్ తరగతులకూ నాంది పలికింది. దీనికి కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన 'పెర్‌ఫారెమెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్'లో కూడా ఏపీ అగ్రభాగాన నిలిచింది.
- 2019లో రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టేనాటికి విద్యారంగంలో లెవల్-6 లో ఉన్న ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ కృషితో ఏకంగా లెవల్-2కు చేరుకోవడం గమనార్హం.

అనకాపల్లి జిల్లాలో పాఠశాల వివరాలు..	
మొత్తం పాఠశాలలు	- 1,901
ప్రైమరీ స్కూల్స్	- 1,129
అప్పర్‌ప్రైమరీ	- 341
హైస్కూల్స్	- 431
విద్యార్థుల సంఖ్య	- 2,21,788
మొత్తం ఉపాధ్యాయులు	- 10,412

స్కూల్ అసిస్టెంట్‌లను సర్దుబాటు చేశారంతే..



మ్యాపింగ్‌లో భాగంగా ఎంపీయూపీ స్కూల్స్‌లో గతంలో ప్రైమరీ, అప్పర్‌ప్రైమరీ రెండూ కలిసి ఉన్నాయి. వీటిని ఒకటి నుంచి మూడు వరకూ ప్రైమరీగా 3 నుంచి 5 తరగతులను సమీపంలో గల హైస్కూళ్లలోకి మార్చడం జరిగింది. దీంతో ప్రైమరీ ఉన్న చోట ఎస్‌జీటీలు ఉంటారు. మూడో తరగతి ఆపై ఉన్న చోట స్కూల్ అసిస్టెంట్‌లను మార్పు చేయడం జరిగింది. దీనిని సమస్యగా చూపడం తగదు. – డి.గోపీనాథ్, పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రెసిడెంట్

బోధనలో నాణ్యత తగ్గదు



ఎంపీయూపీ స్కూళ్లను సమీప హైస్కూళ్లకు మ్యాపింగ్ చేస్తున్నాం. టీచర్‌లనూ సమీప హైస్కూళ్ల లో సర్దుబాటు చేశాం. 98 మంది విద్యార్థుల కన్నా తక్కువగా జిల్లాలో 75 యూపీ సూళ్లు ఉన్నాయి. వాటి లో 350 మంది స్కూల్ అసిస్టెంట్‌లున్నారు. వీరిలో కొందరికి సాధారణ బదిలీలో స్థానచలనం అయింది. కొత్తగా 21 అప్‌గ్రేడ్ స్కూళ్లు కూడా ఉన్నాయి. 98 మంది కన్నా తక్కువ ఉన్న చోట విద్యార్థుల సంఖ్య పెరిగితే అక్కడ స్కూల్ అసిస్టెంట్‌ను కూడా వేయడం జరుగుతుంది.

– వెంకట లక్ష్మమ్మ, డీఈవో, అనకాపల్లి

ఇదీ ఈనాడు దుష్ప్రచారం...

సబ్జెక్టు టీచర్ల తొలగింపు

గడచిన విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాథమికోన్నత పాఠశాలలకు సమీపంలో గల ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను విలీనం చేశారు. వారికి కూడా ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థుల మాదిరిగా సబ్జెక్ట్ టీచర్లతో బోధన జరుగుతుందని, దీని వల్ల విద్యా ప్రమాణాలు మెరుగు పడతాయని ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ ఏడాది వచ్చే సరికి 98 మంది కంటే తక్కువ పిల్లలు గల ప్రాథమికోన్నత పాఠశాలలకు సబ్జెక్టు టీచర్లను కేటాయించలేమని చెబుతూ ఆయా స్కూళ్లలో పని చేస్తున్న సబ్జెక్టు టీచర్లను తప్పించి హైస్కూళ్లకు సర్దుబాటు చేసింది. వారి స్థానంలో నలుగురు ఎస్‌జీటీలను నియమించి వారితోనే మూడు నుంచి ఎనిమిది తరగతులకు బోధన జరపాలని నిర్ణయించింది. సబ్జెక్టు టీచర్లకు, వీరికి బోధనలో తేడా ఉంటుందని, దీనివల్ల పిల్లల విద్యా ప్రమాణాలపై ప్రభావం పడుతుంది.

ఇదీ వాస్తవం...

సర్దుబాటు మాత్రమే...

ఏపీ ప్రభుత్వం ఇప్పుడు నూతన విద్యా విధానం అమలుకు శ్రీకారం చుడుతుంది. అన్ని పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయడంలో భాగంగా టీచర్ల సర్దుబాటు జరుగుతోంది. గత విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రాథమికోన్నత (యూపీ) పాఠశాలల్లో 98 మంది కన్నా తక్కువగా విద్యార్థులున్న చోట స్కూల్ అసిస్టెంట్ టీచర్లను సర్దుబాటు చేస్తోంది. శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్, ప్రీ హైస్కూల్, హైస్కూల్, హైస్కూల్ ప్లస్‌లుగా నూతన విద్యావ్యవస్థను అమలు చేయడానికి మ్యాపింగ్ చేపడుతోంది. ఇప్పటికే జిల్లాలో 219 ప్రైమరీ, ప్రాథమికోన్నత పాఠశాలలను 132 హైస్కూల్స్‌కి మ్యాపింగ్ చేశారు. ఎంపీ యూపీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా వాటిని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీగా విభజించి..అక్కడ ఉన్న స్కూల్ అసిస్టెంట్లను సమీప హైస్కూళ్లకూ సర్దుబాటు చేస్తున్నారు. నూతన విద్యా విధానం ప్రకారం శాటిలైట్ స్కూళ్లగా ఎల్‌కేజీ, యూకేజీలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటుకూ...ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూళ్లను ఫౌండేషన్ (ఒకటి నుంచి మూడో తరగతి వరకూ), ఫౌండేషన్ ప్లస్ (ఒకటి నుంచి ఎనిమిది వరకూ), ప్రీ హైస్కూల్(ఒకటి నుంచి ఎనిమిది వరకూ), హైస్కూల్ (ఐదు నుంచి పది వరకూ), హైస్కూల్ ప్లస్ (ఇంటర్) అమలుకు విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 మంది టీచర్ల కంటే తక్కువగా ఉన్నటువంటి 150 యూపీ స్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్లను సమీప హైస్కూల్‌కు సర్దుబాటు చేశారు. వీటిలో అనకాపల్లి జిల్లాలో 75 యూపీ స్కూళ్లలో టీచర్లను సర్దుబాటు చేశారు. అదేవిధంగా అల్లూరి జిల్లాలో 64 యూపీ స్కూళ్లలో చేశారు.

సెల్ఫీ వార్

- వాటర్‌గ్రిడ్ పూర్తి చేయలేదని టీడీపీ నాయకుల విమర్శలు
- ఆధారాలతో గట్టిగా కౌంటర్ ఇచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలు
- సెల్ఫీలతో పోటాపోటీగా వాగ్బాణాలు



వాటర్‌గ్రిడ్ వద్ద సెల్ఫీ దిగుతున్న టీడీపీ నాయకులు



వాటర్‌గ్రిడ్ వద్ద సెల్ఫీ దిగి వాస్తవాలు వెల్లడిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నక్కపల్లి: ఉద్దండపురం వద్ద నిర్మాణంలో ఉన్న వాటర్‌గ్రిడ్ చుట్టూ గురువారం సెల్ఫీ వార్ నడిచింది. పాయకరావుపేటలో టీడీపీ బస్సు యాత్ర ప్రారంభించిన సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ఉద్దండపురం వద్ద వాటర్‌గ్రిడ్ నిర్మాణం ప్రారంభిస్తే పూర్తి చేయలేని దుస్థితిలో ప్రస్తుత ప్రభుత్వం ఉందని, ప్రజలకు కనీసం తాగునీరు కూడా సరఫరా చేయలేకపోతున్నారని విమర్శించారు. ఉద్దండపురం వాటర్‌గ్రిడ్ వద్ద వీరంతా సెల్ఫీ దిగారు. అయితే వాస్తవాలు కప్పిపుచ్చి అవాకులు చవాకులు మాట్లాడడంతో చివరకు వారు నవ్వులపాలు కావాల్సి వచ్చింది.

వాటర్‌గ్రిడ్‌కు శ్రీకారం చుట్టింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఆయన హయాంలోనే పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో తాజాగా రూ.88 కోట్లు మంజూరు చేయడంతో పెద్ద ఎత్తున పనులు చేపట్టనున్నారు. ఈ వాస్తవాలను వెల్లడిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు సెల్ఫీలతో ఎదురుదాడి చేశారు.

టీడీపీ నేతలు సెల్ఫీలు దిగడం సిగ్గుచేటు

పాయకరావుపేట నియోజకవర్గంలో 97 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే సదాశయంతో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు వైఎస్సార్ 2009లో శ్రీకారం చుట్టారని, ఈ బృహత్తర పథకాన్ని హైజాక్ చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ టీడీపీని హెచ్చరించారు. మహానేత హయాంలోనే ఈ ప్రాజెక్టును రూ.31 కోట్లతో ప్రారంభించారని, ఆయన మరణానంతరం వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రులు పట్టించుకోలేదని, 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అరకొరగా రూ.51 కోట్లు విడుదల చేసి, చేపట్టిన పనులతో 8 గ్రామాలకు మాత్రమే నీటిని సరఫరా చేయగలుగుతున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ తాజాగా రూ.88 కోట్లు విడుదల చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత టీడీపీ రాష్ట్ర నాయకులను ఉద్దండపురం తీసుకువచ్చి అసంపూర్తిగా ఉందని, ప్రభుత్వం పట్టించుకోలేదంటూ సెల్ఫీలు దిగడం సిగ్గుచేటన్నారు. వాటర్‌గ్రిడ్ వద్ద వీసం రామకృష్ణతోపాటు ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ ఈశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పొడగట్ల పాపారావు సెల్ఫీలు దిగారు. వాటర్‌గ్రిడ్ ప్రారంభించింది వైఎస్సార్.. పూర్తి చేసేది ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డేనని స్పష్టం చేశారు.

2009లోనే బీజం

ఉద్దండపురం వాటర్‌గ్రిడ్‌కు 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలోనే బీజం పడింది. అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కృషితో రూ.31 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో ఏలేరు కాలువ నుంచి ఉద్దండపురం వరకు ఏలేరు నీటిని తరలించే పైపులైను పనులు గొలుగొండ మండలం నుంచి కోటనందూరు వరకు 22 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయి. ఏలేరు కాలువ నీటిని పాయకరావుపేట నియోజకవర్గ తాగునీటి అవసరాలకు ఉపయోగించేందుకు అనుమతులు కూడా వైఎస్ హయాంలోనే వచ్చాయి. తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం రూ.51 కోట్లు విడుదల చేయడంతో పైపులైను పూర్తి చేసి, వాటర్‌ట్యాంకులు నిర్మించారు. ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి 8 గ్రామాలకు తాగు నీరు అందించారు. తాజాగా ఎమ్మెల్యే బాబూరావు కోరిక మేరకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.88 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియలో ఉంది. పూర్తయితే పనులు ప్రారంభిస్తాం. –ఆనంద్, డివిజినల్ ఇంజినీర్

తుస్సుమన్న బస్సు యాత్ర

ఆశ లావు.. పీక సన్నం మాదిరిగా తయారయింది టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత బస్సు యాత్ర. ఉత్తరాంధ్ర సీనియర్ నేతలతో భారీ స్థాయిలో తమ భవిష్యత్తుకు గ్యారంటీ పొందేందుకు చేపట్టిన చైతన్య రథం వెంట నడిచేందుకు నలుగురు పేరెన్నికగన్న నేతల్లేక నీరసపడింది. నమ్ముకున్న నాయకులు హ్యాండివ్వడంతో ఉన్నవారితోనే మమ అనిపించాల్సి వచ్చింది.

- గైర్హాజరైన అచ్చెన్న, యనమల
- ముఖం చాటేసిన గంటా వర్గం
- ఆశించిన స్థాయిలో స్పందన లేక డీలా

నక్కపల్లి: భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథం పేరిట టీడీపీ నాయకులు చేపట్టిన ఉత్తరాంధ్ర బస్సు యాత్ర తుస్సుమంది. యాత్రకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర సీనియర్ నేత కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు గైర్హాజరయ్యారు. వీరితోపాటు మరో సీనియర్ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, అతని వర్గం నేతలు ముఖం చాటేశారు. దీంతో బస్సు యాత్ర ప్రారంభమే అభాసుపాలైనట్టు పార్టీ కేడర్ గుసగుసలుపోతోంది. టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆధ్వర్యంలో జరగనున్న ఈ బస్సుయాత్రలో అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు పాల్గొంటారని విస్తృత ప్రచారం చేశారు. గంటా శ్రీనివాసరావు ప్రస్తావన మాత్రం ఎక్కడా తీసుకురాలేదు. పాయకరావుపేట నియోజక వర్గం నుంచి ప్రారంభించి ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల్లో యాత్ర కొనసాగించి, ప్రభుత్వ తీరును ఎండగడతామని బీరాలు పోయారు. ఉత్తరాంధ్రకు చెందిన పార్టీ సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలందరినీ ఆహ్వానించి తమ బలాన్ని ప్రదర్శించాలనుకుంటే వీరికి ఆదిలోనే హంసపాదు ఎదురైనట్టయింది. నాయకులు, కార్యకర్తలు ఆశించిన విధంగా ఈ యాత్రకు అచ్చెన్నాయుడు, పక్క జిల్లాకు చెందిన సీనియర్ నేత యనమల రాలేదు. జిల్లాలో సీనియర్ నేత అయ్యన్న, అనితల వ్యతిరేక వర్గానికి నాయకత్వం వహిస్తున్న మరో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఆయన వర్గీయులు కూడా పత్తాలేదు.

పాయకరావుపేట నియోజకవర్గంలోని అనిత వ్యతిరేక వర్గం ముఖం చాటేసింది. నియోజకవర్గం తెలుగు తమ్ముళ్ల నుంచి కూడా ఆశించిన స్పందన రాలేదు. షెడ్యూల్ ప్రకారం బస్సులో కూర్చుని యాత్ర కొనసాగించాల్సిన నాయకులంతా సెల్ఫీలు దిగిన తర్వాత ఎవరి కారులో వారు తిరుగుముఖం పట్టారు. భోజనాల దగ్గర, కార్యక్రమం దగ్గర మాత్రమే కార్లు దిగి, ప్రభుత్వాన్ని విమర్శించేందుకే యాత్ర పరిమితం కావడం గమనార్హం.